

ముప్పును ముందే చెబుతాయి

వాతావరణానికి సంబంధించిన వివరాలు అందించే ప్రత్యేక యాప్‌లు అందుబాటులోకి వచ్చాయి. వివరాలు 8లో ▸



పేదల కోసం పోరాటం

ప్రజల కోసం అలుపెరుగని పోరాటాలు చేసిన చరిత్ర సీపీఐకి ఉందని ఆ పార్టీ నేత చాడ వెంకట్ రెడ్డి అన్నారు. వివరాలు 8లో ▸




విద్యార్థులకు రక్షణ కరువు

పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో పాములు ప్రత్యక్షమవుతున్నాయి.

వివరాలు 9లో ▸

మార్పు వెనుక మతలబేమిటో!



మంత్రి వివేక్

- చర్చనీయాంశంగా మారిన ఇన్‌చార్జి మంత్రి మార్పు నిర్ణయం
- కొండా సురేఖను తప్పించి వివేక్ నియామకం
- ఆ నియోజకవర్గాల్లో కేడర్ సమన్వయం వివేక్‌కు సవాలే



మంత్రి కొండా సురేఖ

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి మార్పుపై రాజకీయ, అధికార వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ బాధ్యతల నుంచి కొండా సురేఖను తప్పించి కొత్తగా మంత్రిగా బాధ్యతలు తీసుకున్న గడ్డం వివేక్ వెంకటస్వామిని ఇన్‌చార్జి మంత్రిగా నియమిస్తూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువు దీరిన వెంటనే కొండా సురేఖ ఉమ్మడి మెదక్ జిల్లాకు ఇన్‌చార్జి మంత్రిగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలుతోపాటు, ఇటు జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజా ప్రతినిధులు, ఆయా నియోజకవర్గాల ముఖ్యనేతలను సమన్వయం చేయడంలో ఇన్‌చార్జి మంత్రిది కీలక బాధ్యత ఉంటుంది. ఉమ్మడి జిల్లాలో ప్రతిపక్ష బీఆర్‌ఎస్ బలంగా ఉంది. మొత్తం 11 నియోజకవర్గాల్లో కేవలం నాలుగు చోట్ల మాత్రమే కాంగ్రెస్ ఎమ్మెల్యేలున్నారు. మిగిలిన ఏడు చోట్ల ప్రతిపక్ష బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇలాంటి రాజకీయ పరిస్థితులు నెలకొన్న జిల్లాలో ఇన్‌చార్జి మంత్రి పాత్ర మరింత కీలకం. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ కీలక నేతలను, కేడర్‌ను సమన్వయం చేయాల్సిన అవసరం ఉంటుంది. ఎంతో కీలకమైన ఇన్‌చార్జి మంత్రిగా కొండా సురేఖను మార్చడం వెనుక కారణమేమై ఉంటుందోననే దానిపై చర్చ జరుగుతోంది.

కలకలం రేపిన వేర్వేరు సమీక్షలు

జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ, ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖలు ఒకే అంశాలపై ఒక్క రోజు వ్యవధిలోనే వేర్వేరుగా సమావేశాలు నిర్వహించడం అధికార వర్గాల్లో చర్చోపచర్చలకు దారితీసింది. ధాన్యం సేకరణ, ఇందిరమ్మ ఇళ్లు, ఖరీఫ్ పనుల సమాయత్తం వంటి అంశాలపై ఆయా ఉమ్మడి జిల్లాల ఇన్‌చార్జి మంత్రులు సమీక్ష నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించిన విషయం విదితమే. ఈ ఆదేశాల మేరకు పక్షం రోజుల క్రితం ఉమ్మడి జిల్లాల కలెక్టర్లతో సమీక్ష సంగారెడ్డిలో జరిగింది. మీడియాను అనుమతించకుండా నిర్వహించిన ఈ సమీక్ష సమావేశానికి ఇద్దరు మంత్రులు హాజరైనప్పటికీ.. కేవలం కొండా సురేఖ మాత్రమే సమీక్షలో మాట్లాడారని తెలిసింది. ఈ సమీక్ష జరిగిన 24 గంటలు గడవకముందే దామోదర రాజనర్సింహ ఇవే అంశాలపై జిల్లా పరిషత్‌లో మరోసారి సమీక్షలు నిర్వహించారు. ఇలా కొండా సురేఖ సమీక్షించిన అంశాలనే ఒక్క రోజు కూడా గడవకముందే దామోదర సమీక్షించడం అధికార వర్గాల్లో ఆసక్తికరమైన చర్చకు దారితీసింది. ఇలా జిల్లా మంత్రితో పొసగక పోవడంతోనే ఇన్‌చార్జి మంత్రి మారారనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. మరోవైపు ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించేందుకు సన్నద్ధమవుతోంది. జీహెచ్‌ఎంసీ తర్వాత రాష్ట్రంలోనే అతిపెద్దదైన గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌ను కైవసం చేసుకోవాలంటే పకడ్బందీగా కార్యాచరణ అవసరం ఉంటుంది. ఇన్‌చార్జిగా బాధ్యతల్లో ఉంటే ఈ ఎన్నికలకు పూర్తి స్థాయిలో సమయం కేటాయించడం కుదరకపోవచ్చనే కారణంగానే ఈ బాధ్యతల నుంచి తప్పించారనే అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది.

ఆ నియోజకవర్గాల్లో కీలకం

ఇన్‌చార్జి మంత్రిగా నియమితులైన వివేక్‌కు ఒకవిధంగా ఈ బాధ్యతలు సవాలుగానే కనిపిస్తోంది. ప్రతిపక్ష బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యేలే అధికంగా ఉండడంతో పార్టీ కేడర్‌ను సమన్వయం చేయాల్సిన అవసరం ఉంది. ప్రధానంగా బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో సమన్వయం కీలకం.

న్యూస్‌రీల్

మనుచౌదరి రిలీవ్

బాధ్యతలు చేపట్టనున్న నూతన కలెక్టర్ హైమావతి

సిద్దిపేటరూరల్: జిల్లాకు నూతన కలెక్టర్‌గా హైమావతి రానుండటంతో.. ఇప్పటివరకు కలెక్టర్‌గా విధులు నిర్వహించిన మిక్కిలినేని మనుచౌదరి శుక్రవారం రిలీవ్ అయ్యారు. ఈ మేరకు శనివారం నూతన కలెక్టర్ బాధ్యతలు చేపట్టనున్నట్లు సమాచారం.

క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

సిద్దిపేటజోన్: ప్రభుత్వ క్రీడా పాఠశాలల్లో నాల్గవ తరగతిలో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా యువజన క్రీడాశాఖాధికారి (డీవైఎస్ఓ)వెంకట్ నర్సయ్య తెలిపారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. హకీంపేట్, కరీంనగర్, ఆదిలాబాద్ ప్రాంతాల్లోని క్రీడా పాఠశాలల్లో 2025–26 సంవత్సరానికి గాను నాల్గో తరగతిలో విద్యార్థిని, విద్యార్థులకు అడ్మిషన్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారన్నారు. ఈ నెల 16 నుంచి 19 వరకు మండల స్థాయిలో ఎంపికలు నిర్వహిస్తారన్నారు. ఎంపికైన వారికి ఈనెల 24న జిల్లా స్థాయిలో ఎంపిక ఉంటుందన్నారు. ఆయా క్రీడా పాఠశాలల్లో మొత్తంగా 40 చొప్పున 120 సీట్లు ఉన్నాయని, వీటిలో 60 బాలికలకు, 60 బాలురులకు కేటాయించారన్నారు. ఆసక్తిగల వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రభుత్వ బడుల్లోనే అత్యుత్తమ బోధన

డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి



అల్లీపూర్ ప్రాథమిక పాఠశాలలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న డీఈఓ

చిన్నకోడూరు(సిద్దిపేట): ప్రభుత్వ పాఠశాలల్లోనే అత్యుత్తమ విద్యా బోధన అందుతుందని డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అల్లీపూర్ కేజీబీవీలో విద్యార్థినులకు దుస్తులు, పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. అలాగే ప్రాథమిక పాఠశాలలో చిన్నారులచే అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, రెండు జతల స్కూల్ డ్రెస్‌లు, మధ్యాహ్న భోజనం, అన్ని విధాల సౌకర్యాలను కల్పిస్తోందన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో పిల్లలను చేర్పించి డబ్బులు వృథా చేసుకోవద్దని సూచించారు. అనంతరం కమ్మర్లపల్లి ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. కార్యక్రమంలో ఎంఈఓ యాదవరెడ్డి, కేజీబీవీ స్పెషలాఫీసర్ నీలిమ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌ను కలిసిన ప్రతాప్‌రెడ్డి



కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్‌రూరల్: ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్, బీఆర్‌ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి తన పుట్టినరోజు సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో కేసీఆర్ ఆశీర్వాదాలు తీసుకున్నారు. అలాగే మాజీ మంత్రి హరీశ్‌రావును కలవగా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్‌ఎస్ నాయకులు గజ్వేల్‌లో అన్నదాన కార్యక్రమంతో పాటు కేక్‌ను కట్‌చేసి వేడుకలను నిర్వహించి ప్రతాప్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం

సిద్దిపేటకమాన్: యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని డాక్టర్ రేవతి తెలిపారు. సిద్దిపేట ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో ఉచిత యోగా శిక్షణ తరగతులను ప్రారంభించి ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలుష్యాల వల్ల ప్రజలు రోగాల బారిన పడుతున్నారని అన్నారు. యోగాను జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. ప్రపంచానికి భారతీయ యోగా ఆదర్శంగా మారుతుందని అన్నారు. కార్యక్రమంలో నర్సింగ్ కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వాగుల్లో తోడేళ్లు!

ఇసుకాసురుల బరితెగింపు

- యథేచ్ఛగా సాగుతున్న అక్రమ రవాణా
- మోయతుమ్మెద, ఎల్లమ్మవాగుల్లో తోడేస్తున్న అక్రమార్కులు
- చోద్యంచూస్తున్న అధికారులు
- భూగర్భ జలాలు పడిపోతున్నాయంటూ రైతుల ఆవేదన



దూల్మిట్ట మండలం జాలపల్లిలో ఇసుకను తవ్వుతూ ట్రాక్టర్లలో లోడ్ చేస్తున్న కార్మికులు

దూల్మిట్ట మండలం జాలపల్లిలో రైతుకు తెలియకుండానే పొలం నుంచి అక్రమంగా ఇసుకను తోడేస్తున్నారు. సమీప రైతులు ఎందుకు తవ్వుతున్నారని ప్రశ్నిస్తే బెదిరింపులకు గురి చేస్తున్నారు. దీంతో రైతులు భయాందోళన చెందుతున్నారు. ఇలా తవ్వడంతో భూగర్భ జలాలు పడిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలంటూ రైతులు కోరుతున్నారు.

– సాక్షి, సిద్దిపేట

మోయతుమ్మెద వాగు పరిసర గ్రామాల్లో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. తోడుకున్నోళ్లకు తోడుకున్నంత అన్నరీతిలో ఇసుకను తరలిస్తున్నారు. రాత్రి అయ్యిందంటే చాలు ట్రాక్టర్లు పోటాపోటీగా వెళ్తున్నాయి. అక్రమార్కులకు ఇసుక దందా కాసుల పంట పండిస్తోంది. వాల్టా చట్టాన్ని ఉల్లంఘిస్తూ ఇష్టానుసారంగా ఇసుక తవ్వుతున్నారు. అధికారులకు తెలిసినా నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తుండడం విమర్శలకు తావిస్తోంది. అధికారులు స్పందించి ఇసుక అక్రమ తవ్వకాలను నిలిపివేయాలని స్థానికులు కోరుతున్నారు.

జోరుగా దందా

కోహెడ మండలంలోని మోయతుమ్మెద వాగులో అక్రమార్కులు ఇసుకను యథేచ్ఛగా తోడేస్తున్నారు. వాగు పరిసర గ్రామాలైన తంగళ్లపల్లి, బస్వాపూర్, వింజపల్లి, రాంచంద్రాపూర్, వరికోలు.. అలాగే ఎల్లమ్మవాగు నకిరేకొమ్ముల, నారాయణపూర్, నంగనూరు మండలం ఖాతా, అక్కెనపల్లి, ఘన్‌పూర్, దూల్మిట్ట మండలం అర్జునపట్ల, జాలపల్లిలో ఈ దందా జోరుగా సాగుతోంది. రోజూ టన్నుల కొద్దీ ఇసుక హుస్నాబాద్, కరీంనగర్, సిద్దిపేట, హైదరాబాద్‌కు ట్రాక్టర్లు, బొలెరో, లారీల్లో తరలిస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్ ఇసుకను రూ.4,500 నుంచి రూ.5వేల వరకు విక్రయిస్తున్నారు. స్థానిక వాగుల్లో నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నా అధికారులు దృష్టి సారించడంలేదు. మామూళ్లకు అలవాటుపడి అటువైపు కన్నెత్తి చూడటం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో తమకేవరూ అడ్డు అన్నట్లుగా ఇసుక వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఉన్నత అధికారుల నుంచి సమాచారం వస్తే తప్ప ఇసుక డంప్‌లను సీజ్ చేయడం లేదని విశ్వసనీయ సమాచారం.

పలు చోట్ల వేలం పాట

పోలీసులు, స్థానిక రెవెన్యూ అధికారులు పలు మార్లు ఇసుక డంపులను సీజ్ చేస్తున్నారు. పలు చోట్ల వేలం పాట నిర్వహిస్తుండగా మరికొన్ని చోట్ల వదిలేస్తుండటంతో అక్రమార్కులు అధికారుల కళ్లుగప్పి తరలిస్తున్నారు. ఇదంతా అధికారుల కనుసన్నల్లోనే జరుగుతోందంటూ ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇసుక వాగుల సమీపంలో ఉన్న భూములలో భూగర్భ జలాలు ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సీజ్ చేసిన వివరాలిలా..

కోహెడ పోలీసులు తంగళ్లపల్లి, అరేపల్లి గ్రామాల్లో ఏప్రిల్ నెలలో 95టన్నుల ఇసుక డంప్‌ను సీజ్ చేశారు. దీనిని తహసీల్దార్‌కు అప్పగించారు. మే 20న దూల్మిట్టలో 100ట్రాక్టర్ల ఇసుకను పట్టుకున్నారు. అలాగే జాలపల్లి, వీరబైరాన్‌పల్లిలలో ఇసుక డంప్‌లను ఇటీవల అధికారులు సీజ్ చేశారు. ఇలా పట్టుబడుతున్నా.. కఠిన చర్యలు తీసుకోకపోవడంతో ఇసుకాసురులకు అవకాశంగా తీసుకుని ఇసుక దందాను కొనసాగిస్తున్నారు.



ఇసుక డంప్‌ను సీజ్ చేసిన కోహెడ పోలీసులు

తనిఖీలు నిర్వహిస్తున్నాం

లోకల్ ఇసుకపై జీఓ 3 ప్రకారం స్థానిక తహసీల్దార్, పోలీస్‌లకు అధికారం ఉంటుంది. వాహనాల్లో తరలిస్తుంటే సీజ్ చేసే అధికారం మైనింగ్ శాఖకు ఉంది. ప్రధాన రహదారులపై తనిఖీలు నిర్వహిస్తున్నాం. అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేస్తున్నాం.

– లింగుస్వామి, ఏడీ, మైన్స్

జిల్లా ఇన్‌చార్జి మంత్రిని కలిసిన నర్సారెడ్డి



ఇన్‌చార్జి మంత్రి వివేక్‌తో నర్సారెడ్డి, నాయకులు

గజ్వేల్‌రూరల్: ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా నూతనంగా నియమితులైన గడ్డం వివేక్ వెంకటస్వామిని డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లో ఇన్‌చార్జి మంత్రి వివేక్‌కు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలో పార్టీని బలోపేతం చేస్తూ ప్రభుత్వం చేపట్టే సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని, త్వరలో జరగనున్న స్థానిక సంస్థల్లో సత్తా చాటేలా కృషి చేయాలని, కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేయాలని వివేక్ వెంకటస్వామి సూచించినట్లు నర్సారెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పల్లా త్వరగా కోలుకోవాలని..


చేర్యాల నుంచి యాదగిరిగుట్టకు పాదయాత్ర



పాదయాత్రను ప్రారంభిస్తున్న బాల్‌నర్సయ్య

చేర్యాల(సిద్దిపేట): మాజీ సీఎం కేసీఆర్ ఫాంహౌస్‌లో ఇటీవల ప్రమాదవశాత్తు జారిపడి గాయపడిన జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి త్వరగా కోలుకోవాలంటూ బీఆర్‌ఎస్ నాయకులు పాదయాత్ర చేపట్టారు. స్థానిక 3వ వార్డు బీఆర్‌ఎస్ అధ్యక్షుడు భూమిగారి రాజేందర్ ఆధ్వర్యంలో శుక్రవారం పలువురు చేర్యాల నుంచి యాదగిరిగుట్టకు పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. పాదయాత్రను బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ముస్త్యాల బాల్‌నర్సయ్య ప్రారంభించారు. శనివారం ఉదయం లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించనున్నారు. పాదయాత్రగా వెళ్లిన వారిలో భూమిగారి విజయ్, పుట్ట యశ్వంత్, కల్లాటి విశ్వతేజ ఉన్నారు. ప్రారంభ కార్యక్రమంలో పార్టీ చేర్యాల మండల అధ్యక్షుడు అనంతుల మల్లేశం, నాయకులు నాచగొని వెంకటేష్, ఎర్రోళ్ల రామచంద్రం, పుర్మ వెంకట్‌రెడ్డి, మంచాల కొండయ్య. ఏర్పుల మహేష్ పాల్గొన్నారు.

800 ఏళ్ల పురాతన విగ్రహాన్ని కాపాడుదాం



వెల్కటూరులో లభ్యమైన పురాతన మారకమ్మ విగ్రహం

సిద్దిపేటఅర్బన్: గ్రామ చరిత్రకు లిఖిత పూర్వక ఆధారమైన పురాతన విగ్రహాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని చరిత్రకారుడు కొలిపాక శ్రీనివాస్ అన్నారు. సిద్దిపేట అర్బన్ మండలం వెల్కటూరులో 800 ఏళ్ల చరిత్ర కలిగిన పురాతన మారకమ్మ విగ్రహం ఎలాంటి రక్షణ లేకుండా ఉండటంతో శుక్రవారం పరిశీలించారు. కాకతీయుల కాలంలో 1225 జూన్ 14న వెల్కటూరు గ్రామంలో మారకమ్మ దేవత విగ్రహాన్ని ప్రతిష్ఠించినట్లు విగ్రహం పీఠంపై చెక్కి ఉందన్నారు. గతంలో రోడ్డు పక్కన భూమిలో కూరుకొని ఉండేదని, గుడి కట్టడం కోసం బయటకు తీసిన విగ్రహం ముక్కు భాగంలో ధ్వంసం కావడంతో ప్రతిష్ఠించకుండా అలాగే వదిలేశారని, ఇప్పటికైనా విగ్రహానికి నీడ కల్పించాలని కోరారు.

బల్దియాలో కేటుగాళ్లు

నయా సైబర్ దందా

- ట్రేడ్ లైసెన్స్ బకాయిలంటూ కాల్స్
- మున్సిపల్ కమిషనర్ పేరిట బురిడీ!
- సైబర్ మోసగాళ్ల వలలో పలువురు
- అప్రమత్తంగా ఉండాలంటున్న అధికారులు



మున్సిపాలిటీ

సిద్దిపేటజోన్: జిల్లాలో సైబర్ మోసాలు నిత్యకృత్యంగా మారాయి. ఒక్కొక్క రీతిలో మోసగాళ్ల వలలో అమాయకులు చిక్కుకుంటున్నారు. పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని పిలుపునిస్తున్నా నేరాలు ఆగడం లేదు. సైబర్ కేటుగాళ్లు ప్రస్తుతం సిద్దిపేట బల్దియాపై కన్నేశారు. ట్రేడ్ లైసెన్స్ బకాయిలు, రెన్యువల్ పేరిట ఫేక్ స్కానర్‌తో నయా దందాకు తెర తీశారు. జిల్లా కేంద్రంలో కొన్ని రోజులుగా గుట్టుగా సాగుతున్న కేటుగాళ్ల మోసం ఆలస్యంగా వెలుగు చూసింది. మున్సిపల్ కమిషనర్ పేరిట ఫేక్ కాల్స్ రావడం, అనుమానం వచ్చి బల్దియాలో ఫిర్యాదు చేయడంతో అసలు విషయం తెలిసింది.

కమిషనర్ పేరిట ఫేక్ కాల్స్..

సైబర్ కేటుగాళ్ల దృష్టి బల్దియాలోని పన్నుల చెల్లింపు మీద పడింది. బడా వ్యాపార సంస్థలు ప్రతి ఏటా ట్రేడ్ లైసెన్స్ ఫీజు రూపంలో మున్సిపాలిటీకి డబ్బులు చెల్లించడాన్ని తమకు అనుకూలంగా మార్చుకుని మోసాలకు పాల్పడుతున్నారు. అందుకు అనుగుణంగా మున్సిపల్ కమిషనర్ పేరిట ఫోన్ చేసి మీ దుకాణం.. వ్యాపార సంస్థలకు సంబంధించిన ట్రేడ్ లైసెన్స్ ఫీజు బకాయిలు ఉన్నాయని.. రిన్యూవల్ ఫీజు చెల్లించాలంటూ.. లేని పక్షంలో జరిమానా పడుతుందని భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. ఒకదశలో స్కానర్‌ను పంపించి దాన్ని స్కాన్ చేసి డబ్బులు కట్టాలని బురిడీ కొట్టించే ప్రయత్నాలు చేస్తున్నారు. రెండు రోజుల క్రితం రైతుబజార్ పరిసరాల్లోని ఒక ఆస్పత్రికి చెందిన మెడికల్ షాప్‌నకు సంబంధించి ట్రేడ్ లైసెన్స్ ఫీజు చెల్లించాలని 7780110865 నంబర్ ద్వారా కాల్ వచ్చింది. మున్సిపల్ కమిషనర్ అంటూ కాల్ రావడంతో అనుమానం వచ్చి ఆయన నేరుగా బల్దియా అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఇదే తరహాలో పట్టణంలోని ఒక ఆయిల్ మిల్లు వ్యాపారితో పాటు పలువురు వ్యాపారులకు స్కానర్‌తో మోసం చేసే ప్రయత్నాలు జరిగినట్లు తెలిసింది. ఇటీవల ఒక బార్ అండ్ రెస్టారెంట్‌కు సైబర్ మోసగాళ్లు మున్సిపల్ పేరిట ఫోన్ చేసి రూ. 2,500 వసూలు చేసినట్లు వెలుగుచూసింది. ప్రస్తుతం పట్టణంలో మున్సిపల్ అధికారుల పేరిట ఫేక్ కాల్స్ రావడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

పెద్ద ఎత్తున వ్యాపార సంస్థలు

జిల్లా కేంద్రంలో పెద్ద ఎత్తున వ్యాపార సంస్థలున్నాయి. మున్సిపల్ నిబంధనల మేరకు ప్రతి ఏటా వ్యాపార, వాణిజ్య సంస్థలు తమ ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్ చేసుకోవాలి. అందుకు అనుగుణంగా రెవెన్యూ అధికారులు కొన్ని రోజులుగా పట్టణంలో ప్రచారం చేస్తున్నారు. ప్రతి వ్యాపార, వాణిజ్య సంస్థ నిబంధనల మేరకు ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలని, సకాలంలో రెన్యువల్ చేసుకోవాలని ప్రచారం చేస్తున్నారు. మున్సిపల్ రికార్డుల ప్రకారం పట్టణంలో సుమారు ఐదు వేలపై చిలుకు వ్యాపార సంస్థలు ట్రేడ్ లైసెన్స్ పొందినట్లు తెలుస్తోంది.

అప్రమత్తంగా ఉండాలి



సైబర్ మోసగాళ్ల ఫోన్ కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలి. పట్టణంలో వస్తున్న ఫోన్ కాల్స్ తన దృష్టికి వచ్చింది. మున్సిపల్ కార్యాలయంలో, అధికారులకు మాత్రమే ట్రేడ్ లైసెన్స్, ఇతర పన్నులకు సంబంధించి డబ్బులు చెల్లించి రశీదు పొందాలి. ఫేక్ కాల్స్‌పై సైబర్ క్రైమ్, పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయనున్నాం. ప్రజలకు ఫేక్ కాల్స్ వస్తే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి.

– ఆశ్రిత్ మున్సిపల్ కమిషనర్, సిద్దిపేట

మానేరు కాలువల పరిశీలన

బెజ్జంకి(సిద్దిపేట): వడ్లూరు శివారులోని మానేరు కుడి కాలువ, డిస్ట్రిబ్యూషన్ కాలువలను శుక్రవారం కేంద్ర బృందం పరిశీలించింది. ప్రధాన మంత్రి కృషి సంచాయ్ యోజన పథకంలో భాగంగా కాలువలను పరిశీలిస్తున్నట్లు బృందం సభ్యులు ధీరజ్‌సింగ్, సుధీర్ కుమార్‌లు తెలిపారు. వడ్లూరు కాలువ నుంచి గ్రామాల వ్యవసాయ భూములకు నీరు ఇచ్చేందుకు సబ్ కెనాల్ ప్రతిపాదనలు ఉన్నట్లు తెలిపారు. భూసేకరణ చేసి కాలువ పనులు చేపట్టాలని సూచించారు. అనంతరం తోటపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను పరిశీలించారు. నీటి సామర్థ్యం, ఆయకట్టు తదితర వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో సిద్దిపేట ఇరిగేషన్ ఎస్ఈ సుమతీదేవి, ఈఈ రాములు నాయక్, ఏఈ మహేందర్, హుస్నాబాద్ ఆర్డీఓ రాంమూర్తి తదితరులు పాల్గొన్నారు.



వడ్లూరు కాలువ వద్ద వివరాలు తెలుసుకుంటున్న కేంద్ర బృందం సభ్యులు

క్లుప్తంగా

మానవత్వం చాటుకున్న ఎస్పీ



క్షతగాత్రున్ని ఆస్పత్రికి తీసుకెళ్తున్న క్యూఆర్టీ సిబ్బంది

మెదక్ మున్సిపాలిటీ: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని పోలీసు వాహనంలో ఆస్పత్రికి తరలించి జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస్ రావు మానవత్వం చాటుకున్నారు. శుక్రవారం కొల్చారం పోలీస్ స్టేషన్ పర్యటన ముగించుకొని ఎస్పీ వస్తున్న క్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ వ్యక్తిని తన వెంట ఉన్న క్యూఆర్టీ సిబ్బందితో పోలీస్ వాహనంలో చికిత్స నిమిత్తం మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించాలని సూచించారు. మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఎస్పీ ఆదేశించారు.

26 మందికి జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ వివరాల ప్రకారం... పట్టణంలోని పలు ప్రాంతాల్లో తమ సిబ్బందితో కలిసి వారం రోజుల క్రితం నిర్వహించిన వాహన తనిఖీల్లో 26మంది పట్టుబడ్డారు. వారిని శుక్రవారం కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రూ.40వేల జరిమానా విధించారు.

పాఠశాలలో కంప్యూటర్లు మాయం

హుస్నాబాద్: పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో రెండు కంప్యూటర్లు మాయమయ్యాయి. పాఠశాలకు మంజూరైన 10 కంప్యూటర్లను పైఅంతస్తులో ల్యాబ్ గదిలో ఉంచారు. వీటిని ఇంకా ప్రారంభించలేదు. వేసవి సెలవులు కావడంతో పాఠశాలకు తాళం వేసి ఉంచారు. పాఠశాలల పునఃప్రారంభం గురువారం రెండు కంప్యూటర్లు మాయమైనట్లు గుర్తించారు. ఈ విషయంపై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటయ్య మాట్లాడుతూ పాఠశాల కిటికీ తలుపులు తెరిచే ఉన్నాయని, ఇక్కడి నుంచి ఎత్తుకుపోయి ఉంటారని అనుమానిస్తున్నారు. ఈ విషయంపై డీఈఓకు సమాచారం ఇచ్చామని తెలిపారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కోళ్ల ఫారంలో అగ్నిప్రమాదం

ఝరాసంగం(జహీరాబాద్): ప్రమాదవశాత్తు కోళ్ల ఫారంలో అగ్నిప్రమాదం సంభవించింది. బాధితుడు శ్రీశైలం కథనం ప్రకారం... మండల పరిధిలోని పార్శ్వవరం గ్రామానికి చెందిన శ్రీశైలం మూడు కొన్నేళ్లుగా గ్రామ శివారులోని తమ వ్యవసాయ పొలం వద్ద పౌల్ట్రీ ఫామ్‌ను ఏర్పాటు చేసుకున్నాడు. గురువారం అర్ధరాత్రి సమయంలో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు తగులబెట్టినట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో విద్యుత్తు వైర్లు, కోళ్ల దాణా, డ్రింకర్లు, ఫీడర్లు, కాలిపోయాయి. సుమారు రూ.2లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు తెలిపాడు. షెడ్డు తగులబెట్టిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు పేర్కొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

మనోహరాబాద్(తూప్రాన్): వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ వివరాల ప్రకారం... మండలంలోని వెంకటాపూర్ అగ్రహారం గ్రామానికి చెందిన చిన్నబత్తుల ఆంజనేయులు(32) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం పొలానికి వెళ్లిన ఆంజనేయులు సాయంత్రమైన ఇంటికి రాలేదు. కాగా శుక్రవారం ఉదయం గ్రామ శివారులో అడవి పక్కన ఓ చెట్టుకు ఉరి వేసుకుని కనిపించాడు. కాగా మృతుని భార్య నవనీత భర్త మృతిపై అనుమానం వ్యక్తం చేసింది. ఇంటి వద్ద కొన్ని రోజులుగా భూ వివాదం నడుస్తుందని పోలీసుల ఫిర్యాదులో తెలిపింది. కేసు దర్యాప్తులో ఉంది.

ముప్పును ముందే చెబుతాయి

- అవగాహన లేక దూరంగా ప్రజలు
- ప్రతిఏటా వర్షంతో పంట నష్టం
- పిడుగులతో రైతులు, పశువుల మృత్యువాత
- జాగ్రత్తలు పాటిస్తే ప్రాణాలు కాపాడుకోవచ్చు

వట్‌పల్లి(అందోల్): పిడుగులు, వర్షాలు ప్రధానంగా రైతులకు తీరని నష్టం కలిగిస్తాయి. వేసవి పూర్తి కాకముందే కురిసే వర్షాలతో పాటు పిడుగుల భయం ఎక్కువగా ఉంటుంది. కానీ నేడు కాలం మారింది. వర్షం ఎప్పుడు ఎక్కడ పడుతుందో, ఉరుములు, మెరుపులు, పిడుగులు ఎప్పుడు, ఎక్కడ ఎలా వస్తాయో తెలిపే సాంకేతిక పరిజ్ఞానం దరి చేరింది. దీని సాయంతో రక్షించుకోవడానికి వాతావరణానికి సంబంధించిన వివరాలు అందించే ప్రత్యేక యాప్‌లను ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చింది. పిడుగులు, వర్షాల వల్ల మనుషులు, మూగజీవాలు మరణించిన ఘటనలు అనేకం. గతేడాది మే7న అందోలు మండలంలోని ఎర్రారం గ్రామంలో రైతు పాపయ్య ఎడ్లను తోలుకొని ఇంటికి వస్తున్న క్రమంలో పిడుగుపాటుకు గురై మృత్యువాతపడ్డాడు. జూన్ 5న చౌటకూర్ మండలంలోని సరఫ్‌పల్లిలో పిడుగుపాటుకు గేదె మరణించింది. జూన్ 12న అందోలు మండల పరిధిలోని నేరడిగుంట గ్రామంలో అందోలు అంజమ్మ అనే మహిళా రైతు పొలం పనులకు వెళ్లి వర్షానికి చెట్టుకింద తలదాచుకున్న సమయంలో పిడుగుపాటుకు గురై చనిపోయింది. యేటా ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. వాతావరణ పరిస్థితులను తెలిపే యాప్‌లపై అవగాహన లేక నష్టాలను చవిచూడాల్సి వస్తుంది.

యాప్స్‌తో వాతావరణ పరిస్థితులు తెలుసుకోవచ్చు



దామినీ యాప్

సాధారణంగా వర్షాకాలంతో పాటు ఏప్రిల్, మే నెలల్లో పిడుగులు పడటం సహజం. వ్యవసాయ పనుల హడావిడిలో ఉండే రైతులు పిడుగు పడే సమయంలో దగ్గరలోని చెట్ల కిందికో, మరో చోటికో వెళ్తుంటారు. అవి అంత సురక్షితం కావని నిపుణులు చెబుతున్నారు. ఇలాంటి సందర్భాల్లో రైతులను అప్రమత్తం చేసేదే దామినీ యాప్. దీన్ని గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఇది సమీపంలోని 20 కిలో మీటర్ల దూరంలో 5 నుంచి 20 నిమిషాల్లో ఎక్కడ పిడుగు పడుతుందో అప్రమత్తం చేస్తుంది. దీని వల్ల సురక్షిత ప్రాంతాలకు వెళ్లొచ్చు.

మేఘదూత్‌తో వర్షం సమాచారం

పంట చేన్లకు ఎరువులు అందించాల్సిన సమయంలో లేదా వరి కోతల సందర్భాల్లో రైతులకు నష్టం చేసేవి వర్షాలే. దాన్ని తప్పించుకునేందుకు భారత వాతావరణ శాఖ మేఘదూత్ యాప్‌ను రూపకల్పన చేసింది. గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుంటే తాజా సమాచారాన్ని అందిస్తుంది. రాబోయే 5 రోజుల్లో వాతావరణ మార్పులు, వర్ష సూచనలు సహా ఆకాశం మేఘావృతమవుతుందా? లేదా గాలులు ఏ మేరకు ఎక్కడి నుంచి ఎక్కడకు ఏ దిశగా వీస్తాయో తెలుపుతుంది.

రెయిన్ అలారం

ప్లే స్టోర్‌లో రెయిన్ అలారం అని ఇంగ్లిష్‌లో టైప్ చేస్తే ఈ యాప్ కనిపిస్తుంది. కేవలం ఒక నిమిషంలో డౌన్‌లోడ్ అవుతుంది. వినియోగదారుడు అందించిన వివరాల మేరకు అతను ఉన్న ప్రాంతానికి సమీపంలో 20 కిలోమీటర్ల దూరంలో ఎక్కడ వర్షం పడే సూచనలున్నాయో సమగ్ర సమాచారం క్షణాల్లో అందిస్తుంది. దీంతో వర్షం ముప్పు తెలుసుకొని ముందే జాగ్రత్తపడే అవకాశం ఉంటుంది.

ప్రాణం తీసిన చేపల వేట

చెరువులో మునిగి బాలుడు మృతి



బాలుడి మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

అల్లాదుర్గం(మెదక్): చేపల వేటకు వెళ్లిన బాలుడు కాలు జారి చెరువులో మునిగి మృతి చెందాడు. ఈ ఘటన అల్లాదుర్గం మండలం అప్పాజీపల్లి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన సాయిలు, సంతోష దంపతులు హైదరాబాద్‌లో వాచ్‌మెన్‌గా పని చేస్తూ అక్కడే ఉంటున్నారు. మూడు రోజుల క్రితం గ్రామ దేవతలకు ఉత్సవాలు నిర్వహించడంతో సాయిలు కుటుంబం ఉత్సవాలకు వచ్చారు. ఈ క్రమంలో సాయిలు కొడుకు సతీశ్‌రావ్ (14)తో పాటు మరో ఇద్దరు కలిసి గ్రామ శివారులోని రెలకుంట చెరువులో సరదాగా చేపలు పట్టడానికి వెళ్లారు. ఈ క్రమంలో సతీశ్‌రావ్ ప్రమాదవశాత్తు కాలు జారి నీటిలో మునిగిపోయాడు. వెంట వచ్చిన ఇద్దరు గ్రామంలోకి వెళ్లి విషయం చెప్పారు. స్థానికులు చెరువు వద్దకు వచ్చి వెతకగా అప్పటికే అతడు మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శంకర్ తెలిపారు.

సముద్రంలో కొట్టుకుపోయి వ్యక్తి మృతి

ముంబైలో ఘటన



టంకరి రాము

రామాయంపేట(మెదక్): పట్టణానికి చెందిన వ్యక్తి ప్రమాదవశాత్తు ముంబైలోని సముద్రం అలల్లో కొట్టుకుపోయి మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. బాధిత కుటుంబం వివరాల ప్రకారం... పట్టణానికి చెందిన టంకరి రాము (34)కు భార్య సరితతోపాటు ఎనిమిదేళ్లలోపు ఇద్దరు కూతుర్లు ఉన్నారు. ముంబైలో ఉంటున్న తన సోదరి ఇటీవల రామాయంపేటకు వచ్చారు. సోదరితో పాటు రెండు రోజుల క్రితం రాము కూడా ముంబై వెళ్లాడు. ఆదివారం సాయంత్రం అక్క, పిల్లలతో కలిసి సముద్రంలో బోటు షికారు చేశాడు. రాము బోటు దిగుతున్న క్రమంలో ఒక్కసారిగా వచ్చిన అలల్లో సముద్రంలోకి కొట్టుకుపోయాడు. సమీపంలో ఉన్న పోలీసులు అతన్ని బయటకు తీసేలోగా మృతి చెందాడు. ఈ విషయంపై ఉదయం రామాయంపేటకు సమాచారం రాగా అతని తల్లి భార్యా పిల్లలు బోరున విలపించారు. దీంతో విషాద ఛాయలు అలుముకున్నాయి.

ఈత సరదా.. నిండు ప్రాణం బలి



స్విమ్మింగ్ పూల్ వద్ద హుస్సేన్ మృతదేహం

జిన్నారం (పటాన్‌చెరు): ఈత సరదా ఓ నిండు ప్రాణాన్ని బలిగొన్నది. ఈ ఘటన గుమ్మడిదల పరిధిలోని అన్నారం గ్రామంలో చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా గాగిల్లాపూర్‌కు చెందిన గులాం హుస్సేన్ (35) స్థానికంగా కూలీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో స్విమ్మింగ్ పూల్‌లో ఈత కొట్టేందుకు వచ్చి ప్రాణాలు కోల్పోయాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. స్విమ్మింగ్ శిక్షకులు లేకపోవడంతో ఇలాంటి దుర్ఘటనలు చోటు చేసుకుంటున్నాయని స్థానికులు, బాధితులు వాపోయారు. మండలంలో అనధికారికంగా కొనసాగుతున్న స్విమ్మింగ్ పూల్స్‌ను గుర్తించి యజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య

అదనపు కలెక్టర్ చంద్రశేఖర్



చిన్నారులతో ఓనమాలు దిద్దిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

సంగారెడ్డి ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలలోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జిల్లాలోని అన్ని ప్రాథమిక పాఠశాలల్లో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోతిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో నూతనంగా ఒకటవ తరగతిలో ప్రవేశం పొందిన విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం విద్యార్థులకు ఉచిత పాఠ్య, నోటు పుస్తకాలు, ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు, సమగ్ర శిక్ష సీఎంవో వెంకటేశం, సంగారెడ్డి మండల విద్యాధికారి విద్యాసాగర్, ప్రధానోపాధ్యాయురాలు సునీతతో పాటు ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

కోంటూర్ ప్రాథమిక పాఠశాలలో..

హవేళిఘణాపూర్(మెదక్): మెదక్ మండల పరిధిలోని కోంటూర్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించినట్లు ప్రధానోపాధ్యాయురాలు సంగీత తెలిపారు. అలాగే నోట్‌బుక్‌లు, పాఠ్యపుస్తకాలు అందించారు. ఉపాధ్యాయులు ప్రవళిక, రేవతి పాల్గొన్నారు.



పిడుగుపాటుకు మహిళ మృతి

మరో వ్యక్తికి తీవ్ర గాయాలు



సత్తమ్మ (ఫైల్)

శివ్వంపేట(నర్సాపూర్): పిడుగుపాటుకు మహిళా కౌలు రైతు మృతి చెందింది. మరో వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన మండల పరిధిలోని గూడూర్‌లో శుక్రవారం సాయత్రం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన కొత్తకుమ్మరి బాలమణి,శివరాజు దంపతులు, వీరి కొడుకు శ్రీకాంత్, తమ్ముడు శంకరయ్య అతడి భార్య సత్తమ్మ(45) కలిసి కౌలు భూమిలో వ్యవసాయ పనులు చేస్తున్నారు. పిడుగు పడిన శబ్దాలు వస్తుండటంతో సత్తమ్మ, శ్రీకాంత్ చింత చెట్టు కిందికి వెళ్లారు. వారిపై పిడుగు పడటంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. కొద్ది దూరంలో ఉన్న బాలమణికి సైతం స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు శివ్వంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. సత్తమ్మ ప్రాణాలు కాపాడేందుకు వైద్య సిబ్బంది సీపీఆర్ చేసినప్పటికీ ప్రయోజనం లేకపోవడంతో అంబులెన్స్‌లో నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండంగా మార్గమధ్యలో మృతి చెందింది. శ్రీకాంత్ కాళ్లు కదపలేక షాక్‌లో ఉండగా అతన్ని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

11 మేకలు మృతి...

నంగునూరు(సిద్దిపేట): పిడుగు పాటుకు గురై 11 మేకలు మృతి చెందిన ఘటన శుక్రవారం ఘణపూర్‌లో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రైతులు ఏలేటి లక్ష్మారెడ్డి, లింగంపల్లి కొమురయ్య తన వ్యవసాయ బావి వద్ద మేకలు మేపుతున్నారు. సాయంత్రం ఒక్కసారిగా వర్షం కురవడంతో మేకలు సమీపంలోని చెట్ల కిందికి వెళ్లాయి. ఈ క్రమంలో చెట్టుపై పిడుగు పడటంతో లక్ష్మారెడ్డికి చెందిన ఏడు, సంపత్‌కు చెందిన నాలుగు మేకలు అక్కడికక్కడే మృతి చెందాయి. రైతులు మరో చెట్టు కింద ఉండటంతో వారికి ప్రాణాపాయం తప్పింది.

చర్చిపై...



నారాయణఖేడ్: ఖేడ్ మండలం హుక్రాన (జి) గ్రామ చర్చి పరిసర ప్రాంతాల్లో శుక్రవారం పిడుగు పడింది. దీంతో చర్చి జెండా కాలిపోవడంతో పాటు సౌండ్ సిస్టానికి సంబంధించిన లౌడ్ స్పీకర్లు కింద పడ్డాయి. పరిసరాల్లో ఎవ్వరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

నాడు భర్త.. నేడు భార్య

ఆత్మహత్యకు యత్నించిన దంపతులు మృతి



శోభ (ఫైల్)

శివ్వంపేట(నర్సాపూర్): ఆత్మహత్యకు యత్నించిన దంపతులు చికిత్స పొందుతూ మృతి చెందారు. పదిరోజుల క్రితం పాపన్నపేట మండలం ఏడుపాయల్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన విషయం విధితమే. మండల పరిధిలోని పోతులబోగూడ గ్రామానికి చెందిన పందుల శివకుమార్(40) అతని భార్య శోభ (35) ఆత్మహత్యకు యత్నించారు. గుర్తించిన స్థానికులు చికిత్స నిమిత్తం హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించగా మరుసటి రోజు శివకుమార్ మృతిచెందాడు. భార్య శోభ గురువారం మృతి చెందడంతో శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించారు.

భూ సమస్యలతో మనస్తాపానికి గురై..



రాజు మృతదేహం

పెద్దశంకరంపేట(మెదక్): భూ సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ.ప్రవీణ్‌రెడ్డి కథనం ప్రకారం... ఝరాసంఘం మండలం కక్కెరవాడకు చెందిన రాజు(26)తో కొత్తపేటకు చెందిన బాలమణికి గతంలో వివాహం జరిగింది. వీరికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. ప్రస్తుతం అతడు కొత్తపేటలో నివాసం ఉంటున్నాడు. రాజు తన సొంత గ్రామానికి భూ సమస్యల విషయంపై వెళ్లి మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అత్యుత్తమ ప్రమాణాలతోనే న్యాక్ గుర్తింపు



ప్రొ. సత్యనారాయణకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ప్రిన్సిపాల్

దుబ్బాకటౌన్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో బోధన, సౌకర్యాల కల్పన, సాంకేతికత వినియోగం లాంటి ప్రమాణాలను మెరుగు పరచుకోవడం ద్వారా న్యాక్ గుర్తింపు సాధించవచ్చని ప్రొ.ఎస్‌వీ సత్యనారాయణ అన్నారు. శుక్రవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో చెక్ ప్రాజెక్ట్ కింద ఎంపికైన 22 కళాశాలల్లో, 11 కళాశాలలకు తాను మెంటార్‌గా ఉన్నానని, వాటిలో దుబ్బాక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఒకటని తెలిపారు. నైపుణ్య శిక్షణ తరగతులు, సర్టిఫికెట్ కోర్సుల నిర్వహణ, డిజిటల్ లైబ్రరీ వినియోగం, బోధనలో ఐటీసీ వనరుల వినియోగం, కృత్రిమ మేధ వంటి అధునాతన సాంకేతికతలను అధ్యాపకుల బోధనలతో అనుసంధానించడం వల్ల న్యాక్ గుర్తింపులో మెరుగైన ఫలితాలు సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.భవాని, వైస్ ప్రిన్సిపాల్ శ్యాంసుందర్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ వెంకట్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

పాలనలో కేంద్ర ప్రభుత్వం విఫలం

ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

సిద్దిపేటఅర్బన్: కేంద్ర ప్రభుత్వం విద్య, వైద్యం అందించడంలో, సమానత్వ పాలన అందించడంలో విఫలమైందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు విమర్శించారు. సిద్దిపేట మొదటి ఎమ్మెల్యే, సీపీఐ నాయకుడు ఎడ్ల గురువారెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మావోయిస్టులపై కొనసాగుతున్న ధమనకాండను ప్రభుత్వం విరమించుకోవాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన వాగ్దానాలను నెరవేర్చే దిశగా పరిపాలన కొనసాగించాలన్నారు. అలాగే గురువారెడ్డి విగ్రహానికి మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు నివాళులర్పించారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, నాయకులు లక్ష్మణ్, శంకర్, బన్సీలాల్ తదితరులు పాల్గొన్నారు.

రసాయన ఎరువులు వాడొద్దు

వ్యవసాయ శాస్త్రవేత్తలు

నర్సాపూర్ రూరల్: మోతాదుకు మించి రసాయన ఎరువులు వాడితే భూమి సారం కోల్పోయి పంటల దిగుబడి తగ్గుతుందని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు డాక్టర్ శాంతి, డాక్టర్ రవీందర్ నాయక్, డాక్టర్ సుశీల, డాక్టర్ రంజిత రైతులకు సూచించారు. శుక్రవారం నర్సాపూర్ మండలంలోని గూడెం గడ్డ, హనుమంతపూర్, తుజాల్ పూర్ గ్రామాల్లో శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు సాగు పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈఓలు, చంద్రవేణి , దుర్గాప్రసాద్, రవివర్మ, వ్యవసాయ కళాశాల విద్యార్థులు, మూడు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

వరి విత్తనాల విక్రయాలు నిలిపివేత

సిద్దిపేటరూరల్: సరైన రికార్డుల నిర్వహణ లేకుండా వరి విత్తనాలు విక్రయిస్తున్న ఓ సీడ్స్ కంపెనీ అమ్మకాలను వ్యవసాయ శాఖ, టాస్క్‌ఫోర్స్ అధికారులు నిలిపివేశారు. శుక్రవారం మండల పరిధిలోని ఇర్కోడ్ వద్ద ఉన్న ఓం జైకిసాన్ సీడ్స్- వరి విత్తన ప్రాసెసింగ్ ప్లాంట్‌ను అధికారులు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికారులు ప్రాసెసింగ్ యూనిట్లో ఉన్నటువంటి రికార్డులను పరిశీలించారు. ఆ రికార్డులు సరైన విధంగా లేకపోవడంతో ఆ ప్లాంట్‌లో ఉన్నటువంటి రూ. 8,99,050 విత్తనాల అమ్మకాలను నిలిపివేశారు. గడువులోపు కార్డులను అందించాలని కంపెనీ నిర్వాహకులకు సూచించారు. దుబ్బాక ఏడీఏ మల్లయ్య, టాస్క్‌ఫోర్స్ సీఐ అంజయ్య, మండల వ్యవసాయ అధికారి నరేష్ పాల్గొన్నారు.

పేదలకోసం రాజీలేని పోరాటం

సీపీఐ నేత చాడ వెంకట్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న చాడ వెంకట్ రెడ్డి

హుస్నాబాద్: ప్రజల కోసం అలుపెరుగని, రాజీలేని పోరాటాలు చేసిన చరిత్ర గల ఏకైక పార్టీ సీపీఐ పార్టీ అని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి అన్నారు. పట్టణంలోని అనబేరి, సింగిరెడ్డి అమరుల భవన్‌లో ఈ నెల 27న నిర్వహించే సీపీఐ 4వ మహాసభల విజయవంతం కోసం శుక్రవారం ఏర్పాటు చేసిన ఆహ్వాన సంఘం సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో బీజేపీ పాలన మతోన్మాదం, పెచ్చరిల్లి పోతుందన్నారు. ఆపరేషన్ కగార్ పేరుతో అడవులను జల్లెడ పడుతూ ఆదివాసీలను చిత్రహింసలకు గురి చేస్తున్నారని ఆరోపించారు. దేశంలో స్వేచ్ఛ, స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్న మావోయిస్టులను చంపడం ఏమిటని ప్రశ్నించారు. ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపి వేయాలని, లేకుంటే ప్రజలతో దేశ వ్యాప్తంగా నిరసన వ్యక్తం చేస్తామని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ఆహ్వాన సంఘం నూతన కమిటీ

సీపీఐ జిల్లా మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షుడిగా సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, ప్రధాన కార్యదర్శిగా హుస్నాబాద్ మండల కార్యదర్శి గడిపె మల్లేశ్, ఉపాధ్యక్షులుగా జాగీర్ సత్యనారాయణ, పోతిరెడ్డి వెంకట్ రెడ్డి, లక్ష్మణ్, శంకర్, వనేష్, అశోక్, దయానంద్ రెడ్డి, కోశాధికారిగా సుదర్శన చారిని ఎన్నుకున్నారు.

ఆయుర్వేద వైద్యుడినంటూ మోసం

కేసు నమోదు

రామాయంపేట(మెదక్): ఆయుర్వేద వైద్యుడి నంటూ ప్రజలను మోసగిస్తున్న వ్యక్తిపై కేసు నమోదైంది. ఎస్‌ఐ బాల్‌రాజ్ కథనం ప్రకారం... ఎలాంటి అర్హతలు లేకపోయినా బీఏఎంఎస్ డాక్టర్‌నంటూ కుమార్ అనే వ్యక్తి కొంత కాలంగా స్థానికంగా క్లినిక్ నడుపుతున్నాడు. నార్సింగి మండల కేంద్రానికి చెందిన ఓ మహిళ ఫైల్స్ బాధతో ఆస్పత్రికి రాగా ఆమె నుంచి రూ. 50 వేల వరకు దండుకొని ఏవేవో మాత్రలు, పొడులు అందజేశాడు. వాటిని వినియోగించుకున్న సదరు మహిళ తీవ్ర అస్వస్థతకు గురికాగా, ఆమె భర్త కామారెడ్డిలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించాడు. ఇన్‌ఫెక్షన్‌కు గురైందని అక్కడి వైద్యులు చెప్పారు. దీంతో బాధిత మహిళ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కుమార్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏబీవీపీ జిల్లా కన్వీనర్‌పై కత్తులతో దాడి

- కడుపులో, ఛాతీలో తీవ్ర గాయాలు
- కరీంనగర్‌లో చికిత్స పొందుతున్న ఆదిత్య



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆదిత్య

హుస్నాబాద్: ఏబీవీపీ జిల్లా కన్వీనర్ సావుల ఆదిత్యపై గురువారం రాత్రి గుర్తు తెలియని దుండగులు కత్తులతో దాడి చేశారు. పోలీసుల వివరాల ప్రకారం... హుస్నాబాద్ పట్టణానికి చెందిన ఆదిత్య గురువారం ఏబీవీపీ పట్టణ నూతన కార్యవర్గాన్ని ప్రకటించాడు. అనంతరం పందిల్లలో ఉన్న తన స్నేహితుడు కలిసేందుకు వెళ్లాడు. అక్కడి నుంచి రాత్రి 8 గంటల సమయంలో బైక్‌పై హుస్నాబాద్‌కు వస్తున్నాడు. మార్గమధ్యలో పొట్లపల్లి శివారు వరకు వచ్చిన తర్వాత మూత్ర విసర్జన చేసేందుకు ఆదిత్య బైక్‌ను ఆపాడు. ఇదే సమయంలో బైక్‌పై వచ్చిన ముగ్గురు గుర్తు తెలియని దుండగులు అతడిని కిందపడేసి కమ్యూనిస్టులను కుక్కలు అని అంటావా అని కత్తులతో దాడి చేశారు. ఆదిత్య కడుపులో, ఛాతీలో తీవ్ర గాయాలయ్యాయి. కొద్ది సేపటికి దుండగులు అక్కడి నుంచి పరారయ్యారు. ఆదిత్య స్నేహితుడు మణిదీప్‌కు ఫోన్ చేయగా వెంటనే అతడు వచ్చి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న ఏసీపీ సదానందం, సీఐ శ్రీనివాస్, ఎస్సై మహేష్ ఆస్పత్రికి వచ్చి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించారు. ప్రస్తుతం ఆదిత్య క్షేమంగానే ఉన్నట్లు తెలుస్తోంది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేష్ తెలిపారు.

ఇటీవల ఆపరేషన్ కగార్‌కు మద్దతుగా ర్యాలీ

హుస్నాబాద్ పట్టణంలో ఈ నెల 9న ఆపరేషన్ కగార్‌కు మద్దతుగా మావోయిస్టులు, నక్సలైట్లు జన జీవనంలో కలవాలని ఆదిత్య ఆధ్వర్యంలో ఏబీవీపీ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. ఈ కారణంగానే ఆదిత్యపై దాడి చేశారా? మరేదైనా కారణం ఉందా? అనేది పోలీసుల దర్యాప్తులో తేలనుంది.

దాడిని ఖండిస్తూ ధర్నా

గుర్తు తెలియని వ్యక్తులు ఆదిత్యపై దాడి చేయడాన్ని ఖండిస్తూ స్థానిక ఏబీవీపీ కార్యకర్తలు శుక్రవారం పాఠశాలల బంద్ నిర్వహించారు. అనంతరం దాడికి పాల్పడిన దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలని మల్లెచెట్టు చౌరస్తాలో ధర్నా నిర్వహించారు.

దాడి సరికాదు

బీజేపీ పట్టణ అధ్యక్షుడు వెంకట్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఏబీవీపీ సిద్దిపేట జిల్లా కన్వీనర్ ఆదిత్యపై జరిగిన దాడిని బీజేపీ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు బాసంగారి వెంకట్ ఖండించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆపరేషన్ కగార్‌కు మద్దతుగా కార్యక్రమం చేసినందుకే అతనిపై దాడి చేశారని మండిపడ్డారు. ఇది ఒక పిరికిపంద చర్య అన్నారు. కత్తులతో దాడి చేయడం, హత్యా ప్రయత్నం చేయడం వెనుక ఎవరు ఉన్నారో తేల్చాలని డిమాండ్ చేశారు. పోలీసులు దుండగులను పట్టుకొని శిక్షించాలని డిమాండ్ చేశారు. లేకపోతే పార్టీ తరఫున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో సంతోష్, బీజేపీ సీనియర్ నాయకులు జనార్ధన్, సునీల్, సత్యనారాయణ, కిరణ్, సంతోష్, పవన్, గణేష్, మహేందర్, శేఖర్ పాల్గొన్నారు.